

బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో కరెంటు లేక చీకట్లోనే కూర్చున్న మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తదితరులు

## బీఆర్‌ఎస్‌ఎల్పీలో కరెంట్ కట్

- అరగంటలో ఐదుసార్లు అంతరాయం
- అసెంబ్లీలోనే ఇలా ఉంటే ఇక రాష్ట్రంలో పరిస్థితేంటని సోషల్ మీడియాలో సెటైర్లు

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఒకవైపు అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతుండగానే బీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ కార్యాలయానికి కరెంట్ కట్ అయ్యింది. పార్టీ ముఖ్య నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమైన సమయంలో అంతరాయం కలిగింది. ఉదయం 8:30గంటల నుంచి 9వరకు అంటే అరగంట వ్యవధిలో ఏకంగా ఐదుసార్లు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం చర్చనీయాంశమైంది. కరెంట్ సరఫరాలో సర్కారు వైఫల్యానికి ఇదే నిదర్శమని పలువురు నాయకులు తెలిపారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలోనూ నెటిజన్లు సెటైర్లు పేల్చారు. సాక్షాత్తు అసెంబ్లీలోనే ఇలా ఉంటే రాష్ట్రంలో పరిస్థితి ఏంటని పోస్ట్‌లు పెట్టారు. కాగా, ఇది అవాస్తమని, బీఆర్‌ఎస్ ఆఫీసుకు కరెంట్ అంతరాయం కలుగలేదని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు తెలిపారు.

## రైతులకు బేడీలు.. విహారయాత్రల్లో మంత్రులు

- ఇది ప్రజాపాలన కాదు.. పోలీసు పాలన : జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): అకారణంగా లగచర్ల రైతులకు బేడీలు వేయించిన ముఖ్యమంత్రి, మంత్రులు.. జైపూర్, ఉదయ్‌పూర్, ఢిల్లీలో విహారయాత్రల్లో మునిగితేలారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజాసమస్యలపై అసెంబ్లీలో చర్చిద్దామంటే ప్రభుత్వం భయపడి పారిపోతున్నదని మండిపడ్డారు. సీట్లో కూర్చున్న తర్వాత నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన స్పీకర్, అధికార పక్షానికి వంతపాడుతున్నారని ఆరోపించారు. లగచర్ల ఘటనపై బీఆర్‌ఎస్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించడమే ఇందుకు నిదర్శనమన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్యేలు కేపీ వివేకానందగౌడ్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్లతో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో సమస్యలే లేనట్టు ప్రభుత్వం అసెంబ్లీలో టూరిజంపై చర్చపెట్టడం దుర్మార్గమని విమర్శించారు.

**ప్రశ్నిస్తే వాయిదా : ఎమ్మెల్యే వివేకా**

బెల్ట్‌షాపుల బెడద నుంచి ప్రజలకు ఎప్పుడు విముక్తి కలిగిస్తారని అసెంబ్లీలో అడిగితే సమాధానం చెప్పకుండా వాయిదా వేయడం విడ్డూరమని ఎమ్మెల్యే వివేకానందగౌడ్ విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బెల్ట్‌షాపులను తొలగించాలని గగ్గోలు పెట్టిన రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క అధికారంలోకి రాగానే మరిచిపోయారని మండిపడ్డారు. ప్రభుత్వం గీతవృత్తిని నిర్వీర్యం చేస్తున్నదన్నారు.

# తెలంగాణ నీ జాగీరా రేవంత్?

- ఎందుకు నియంతలా పాలిస్తున్నవ్?
- రైతులు జైల్లో ఉన్నా పట్టించుకోవా?
- సభలో చర్చించడానికి ఇంతకంటే ముఖ్య అంశం ఇంకేమున్నది?
- తిరుపతిరెడ్డికి ఏ అధికారమున్నది?
- రైతులపై అక్రమ కేసులు ఎత్తేయాలి
- శాసన సభ కొనసాగినన్ని రోజులు ముఖ్యమంత్రి తీరును ఎండగడుతం
- వందసార్లు ఢిల్లీకిపోయి వంద పైసలన్న తెచ్చిండ్రా? : కేటీఆర్ ఫైర్



అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రులు పద్మారావుగౌడ్, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సంజయ్, కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : 'రేవంత్‌రెడ్డీ.. తెలంగాణ నీ జాగీరా?.. కొడంగల్ నీ జాగీరా.. భూమి ఇయ్యనంటే జైల్లో పెట్టేందుకు నువ్వెవరు? నియంతవా? చక్రవర్తివా?' అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో అత్యున్నత వేదిక శాసనసభ అని, ఆ శాసనసభలో రైతుల గురించి చర్చపెట్టుమంటే దమ్ములేక పారిపోయిన దద్దమ్మ రేవంత్‌రెడ్డి అని దుయ్యబట్టారు. తెలంగాణలో లాఠీరాజ్యం.. లూటీ రాజ్యం నడుస్తున్నదని విరుచుకుపడ్డారు. అరాచక, దుర్మార్గ, నికృష్టమైన ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. సోమవారం అసెంబ్లీ ముగిసిన తర్వాత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. చెయ్యని తప్పునకు, కేవలం తమ భూమి తమకే ఉండాలని కోరుకున్నందుకు, తమ భూమిని ప్రభుత్వం గుంజుకుంటుంటే ప్రతిఘటించిన పాపానికి కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గిరిజన, దళిత, బలహీన వర్గాల రైతులను జైల్లో పెట్టిన నికృష్టపు ప్రభుత్వం రేవంత్‌రెడ్డిదని దుయ్యబట్టారు. తమ భూములు ఇవ్వబోమంటే వారిపై అప్రజాస్వామికంగా కేసులు పెట్టి, వారిని థర్డ్ డిగ్రీ టార్చర్‌కు గురిచేశారని ఆవేదన వ్యక్తంచేశారు. కస్టడీలో ఉన్నవారిని కొడుతూ, కరెంటుషాకులిస్తూ తిరుపతిరెడ్డికి, ఎస్పీకి వీడియో కాల్ చేసి పోలీసులు పైశాచిక ఆనందం పొందారని మండిపడ్డారు. 'లగచర్ల రైతుల అరెస్టులపై సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టు పెడితే అరెస్టులు.. మీ ఫ్రీ బస్ వల్ల.. మా రైడర్‌షిప్‌లు తగ్గాయి' అని మెట్రో అధికారులంటే వారిని కూడా అరెస్టు చేసే పద్ధతి రాష్ట్రంలో ఉన్నది' అని నిప్పులు చెరిగారు.

> 30 రోజులకుపైగా రైతులు జైల్లో ఉన్నరు.. ముగ్గురు అనారోగ్యం పాలైండ్రు. రైతు హీర్యా నాయక్‌కు గుండె పోటు వస్తే అత్యంత క్రూరంగా, అమానవీయంగా సంకెళ్లతో దవాఖానకు తీసుకెళ్లి వైద్యం చేయించిండ్రు. ఇంతకంటే అరాచకం, దుర్మార్గం, చిల్లర ప్రభుతాన్ని ఈ దేశంలో ఎన్నడన్న చూసినమా? రాష్ట్ర ప్రజలే మీ భరతం పడుతరు.. ముఖ్యంగా రైతులే పడతరు.
> -కేటీఆర్

### చర్చపెట్టే దమ్ములేక పారిపోయినవ్

'ప్రజాస్వామ్యంలో అత్యున్నత వేదిక శాసనసభ. ఆ శాసన సభలో రైతుల గురించి చర్చపెట్టుమంటే దమ్ములేక పారిపోయిన దద్దమ్మ రేవంత్‌రెడ్డి' అని కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డి జైల్లో ఉన్న కొడంగల్ గిరిజన రైతులు, చర్లపల్లి జైల్లో ఉన్న పట్నం నరేందర్‌రెడ్డి విడుదలవుతారని, న్యాయవ్యవస్థపై తమకు నమ్మకం ఉన్నదని చెప్పారు. రేవంత్‌రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా, కుయుక్తులు పన్నినా ఆ రైతుల తరఫున కొట్లాడుతూనే ఉంటామని, రోజుకో కొత్తరూపంతో వస్తామని, అసెంబ్లీలో ఎండగడతామని హెచ్చరించారు. 'అదానితో నీ దోస్తీని ఎండగట్టేందుకు మేం వస్తే.. శాసనసభలో అడుగుపెట్టనివ్వలేదు. ఇవాళ లగచర్లలో జరిగిన దానిపై చర్చకుపట్టుబడితే రాలేదు. ఎందు కు ఆ గిరిజన ఆడబిడ్డలపై అర్ధరాత్రి అరాచకాలు? వారిపట్ల ఎందుకు దౌర్జన్యం చేస్తున్నవ్? వాళ్లను ఎందుకు భయపెడుతున్నవ్.. మగవాళ్లను జైళ్లలో పెట్టినవ్. ఇంటింటికి పోయి ఆడబిడ్డలను ఎందుకు బెదిరిస్తున్నవ్? అని అడిగితే సమాధానం చెప్పలేని సన్నాసి ప్రభుత్వమిద'ని ధ్వజమెత్తారు.

### మీ తరఫున కేసీఆర్ ఉన్నరు.. భయం వద్దు

'రాష్ట్ర ప్రజానీకానికి, కొడంగల్ ప్రజలకు మేమిచ్చే భరోసా ఒక్కటే.. మీ తరఫున మేమున్నం. కేసీఆర్ ఉన్నరు. ఎన్ని రకాలుగా క్షోభపెట్టే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసినా తప్పకుండా మీకు అండగా నిలబడుతం' అని కేటీఆర్ హామీ ఇచ్చారు. లగచర్లలో ఫార్మా విలేజ్ అనే ప్రతిపాదనను వెనక్కి తీసుకొని మరోవైపు పారిశ్రామిక కారిడార్ పేరిట భూములు గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారని ఎండగట్టారు. 'ఈ రాష్ట్రంలో ఉన్నది ప్రజాస్వామ్య ప్రభుత్వామా? నియంత ప్రభుత్వామా? అనేది ప్రజలు గ్రహించాలి' అని కేటీఆర్ సూచించారు. 'కొడంగల్ ఒక్కటే కాదు.. జహీరాబాద్‌లోనూ రైతులు భూము లు ఇవ్వబోమని అంటున్నరు. అక్కడ కూడా బలవంతంగా గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారనే విషయం మా ఎమ్మెల్యే మాణిక్యం చెప్పిండు. 14 వేల ఎకరాలు గత ప్రభుత్వం సేకరించి పెడితే.. దాన్ని రద్దు చేసి రైతులకు ఇస్తామని చెప్పింది మీరు. ఫార్మాసిటీని వద్దని చెప్పింది మీరు. ఫార్మాసిటీ రద్దు చేస్తున్నామని, రైతులకు భూములిస్తామని, కందుకూరు, యాచారంలో తిరిగి తిరిగి చెప్పింది మీరు. ఇవాళ హైకోర్టును, అటు రైతులను మోసం చేస్తున్నరు' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

### అర్ధరాత్రి తిరుపతిరెడ్డి అరాచకమేంది?

'లగచర్లలో అర్ధరాత్రి అరాచకం ఎందుకు జరిగింది? సీఎం రేవంత్‌రెడ్డి అన్న ఎనుముల తిరుపతిరెడ్డి కనుసన్నల్లో అక్కడ పోలీసులు, అధికారులు ఎందుకు నడుస్తున్నరు? ఒక రాజ్యాంగేతర శక్తిగా తిరుపతిరెడ్డి ఎందుకు ఊరేగుతున్నడు? 200 మంది పోలీసులు ఎందుకు వత్తాసు పలుకుతున్నరు' అని కేటీఆర్ నిలదీశారు. ఈ అంశాలపై అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. గుండెనొప్పి వచ్చిందని చెప్పిన రైతుకు బేడీలు వేసి వైద్యం చేసే దిక్కుమాలిన, నికృష్టపు ప్రభుత్వాన్ని శాసనసభలోనే నిలదీస్తామని హెచ్చరించారు. 'రైతులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే దాకా, పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకునేదాకా, రైతులకు బేషరతుగా క్షమాపణలు చెప్పేదాకా, వారిని జైలు నుంచి విడిపించే దాకా, వారి తరఫున మా పోరాటం కొనసాగుతది.. శాసనసభ జరిగినంత కాలం.. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, సమాధానం రాబడతాం. ఇవాళ మీరు పారిపోవచ్చు.. రేపటి నుంచి ఎక్కడికిపోతరో చూస్తాం' అని కేటీఆర్ హెచ్చరించారు.

> నీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండే రకాల పర్యాటకం కొనసాగుతున్నది. ఒకటేమో ఢిల్లీ పర్యాటకం. ఇందులో ఎక్కే విమానం.. దిగే విమానం తప్ప రూపాయి వచ్చింది లేదు. ఏడాది కాలంగా ముఖ్యమంత్రి 30 సార్లు ఢిల్లీ పోయిండు.. మంత్రులు 70 సార్లు పోయిండ్రు. వీరంతా వందసార్లు పోయినా వంద పైసలు కూడా తేలేదు. ఇక రెండోది జైళ్ల పర్యాటకం. ఎవరు ఈయన మీద మాట్లాడినా వారిని జైల్లో పెట్టాలనేది వారి టార్గెట్. -కేటీఆర్

> సీఎం సొంత నియోజకవర్గానికి చెందిన అమాయక గిరిజన రైతులు 35 రోజులుగా జైల్లో ఉంటే అది సబ్జెక్ట్ కాదట! అది చర్చనీయాంశం కాదట! అది వదిలేసి పర్యాటక రంగానికి సంబంధించి చర్చపెడతానంటున్న రేవంత్‌రెడ్డీ.. నీకు మనసుందా? హృదయం ఉన్నదా? నీకు ఓటు వేసి గెలిపించి ముఖ్యమంత్రిని చేసిన సొంత ప్రజలు జైల్లో ఉంటే పర్యాటక శాఖపై చర్చకు రావడానికి సిగ్గులేదా?
> -కేటీఆర్

### నేడు అంబేద్కర్ విగ్రహాలకు వినతి

లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టి, వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించినందుకు నిరసనగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అణచివేత వైఖరిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 11 గంటలకు అన్ని నియోజకవర్గాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించి నిరసన తెలుపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, పద్మారావుగౌడ్, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డి, సబిత ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముఠాగోపాల్, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, మాగంటి గోపీనాథ్, కోవా లక్ష్మి, డాక్టర్ సంజయ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, విజయుడు, అనిల్ జాదవ్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నేతలు పెయింటర్లే: కేటీఆర్

కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయడం రేవంత్‌రెడ్డి తరం కాదని కేటీఆర్ ఫైర్ అయ్యారు. భద్రాచలంలో కేసీఆర్ హయాంలోనే పూర్తయిన డబుల్ బెడ్రూం ఇండ్లకు రేవంత్ సర్కార్ మూడు రంగులు వేయడంపై సోమవారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ నిర్మించిన ఇండ్లకు సున్నాలు వేసి.. అవే ఇందిరమ్మ ఇండ్లు అని ప్రజల కండ్లకు గంతలు కట్టలేవంటూ ధ్వజమెత్తారు. ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు కేసీఆర్ పడ్డ తపన.. గోసపడ్డ ప్రతి గుండెకూ తెలుసని, ప్రతి పేదవాడికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలనేది కేసీఆర్ కల అని స్పష్టం చేశారు. ఎన్నాళ్లున్నా కాంగ్రెస్ నేతలు పెయింటర్లు మాత్రమేనని.. ఎప్పటికీ మీరంతా సున్నాలేసే బ్యాచ్ మాత్రమేనని సెటైర్లు వేశారు.

## రేవంత్ సహా నిందితులంతా రావాల్సిందే

- ఓటుకు నోటు కేసులో ఈడీ కోర్టు ఆదేశం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు రెండు నెలల సమయం కావాలన్న నిందితుల విజ్ఞప్తిని నాంపల్లి ఈడీ కోర్టు జడ్జి రమేశ్ తిరస్కరించారు. తదుపరి విచారణ జరుగనున్న జనవరి 10న సీఎం రేవంత్‌రెడ్డి సహా నిందితులందరూ కోర్టుకు హాజరుకావాలని హెచ్చరిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాంపల్లి ఈడీ కోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన కేసులో సోమవారం వాదనలు ముగిశాయి. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఉదయ్ సింహా (ఏ2), జెరూసలేం మత్తయ్య (ఎ4), సండ్ర వెంకట వీరయ్య (ఎ7) మాత్రమే కోర్టుకు హాజరయ్యారు. మిగతావారి తరఫున న్యాయవాదులు గైర్హాజరీ పిటిషన్లు దాఖలు చేశారు. వేంనరేందర్‌రెడ్డి కుమారుడు వేంకీర్తన్‌రెడ్డి పేరును కేసులో నుంచి తొలగించాలని ఇటీవల దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఈడీ న్యాయస్థానం విచారణ ప్రారంభించాలని జెరుసలేం మత్తయ్య తరఫు న్యాయవాది జడ్జిని కోరారు. తమకు మరికొంత సమయం కావాలని వేం నరేందర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాదులు కోరగా కోర్టు తోసిపుచ్చింది. తెలంగాణ హైకోర్టులో క్వాష్ కొట్టివేయడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సమయం కావాలని కోరినప్పటికీ కోర్టు నిరాకరించింది.

# లగచర్లపై సభలో లడాయి

మొదటిపేజీ తరువాయి...

'నహీచలేగా నహీచలేగా.. లాఠీ లూటీ నహీ చలేగా' అంటూ పెద్దపెట్టున నినదించారు. శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ, విపక్ష సభ్యులు సభాసంప్రదాయాలు పాటించాలని కోరారు. ఆందోళన విరమించాలని, మాట్లాడే అవకాశం కల్పిస్తామని సభాపతి సూచించారు. బీఆర్‌ఎస్ సభ్యులు ఆందోళన కొనసాగించడంతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూల్ బుక్‌లోని అంశాలను చదివి వినిపించారు. సభలో నినాదాలు చేయడం, ప్లకార్డులు ప్రదర్శించడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. అయినా బీఆర్‌ఎస్ సభ్యులు ఆందోళన కొనసాగించడంతో నిరసన మధ్యనే మంత్రి జూపల్లి ప్రసంగం కొనసాగించాలని స్పీకర్ సూచించారు. విపక్ష సభ్యుల వద్ద ఉన్న ప్లకార్డులను తీసుకోవాలని మార్షల్స్‌కు స్పీకర్ ఆదేశించారు. మార్షల్స్ దగ్గరకు రావడంతో బీఆర్‌ఎస్ సభ్యులు స్పీకర్ పోడియంవైపు దూసుకెళ్లారు. బీఆర్‌ఎస్ సభ్యుల నినాదాలు, ప్లకార్డులు తీసుకునేందుకు మార్షల్స్ ప్రయత్నించడంతో కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో సభను స్పీకర్ మంగళవారానికి వాయిదా వేశారు. మరోవైపు మూసీ ప్రక్షాళన -నిర్వాసితుల సమస్యలు, భయాందోళనలపై చర్చకు సీపీఐ శాసనసభాపక్షనేత కూనంనేని సాంబశివరావు, కాగజ్‌నగర్ ప్రాంతంలో పెద్దపులి దాడులు, నష్టపరిహారం చెల్లింపుపై బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించారు.

### మండలి పోడియాన్ని చుట్టుముట్టిన సభ్యులు

శాసన మండలిలోనూ లగచర్ల అంశంపై చర్చకు అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ సభ్యులు పట్టుబట్టారు. ఆ మేరకు వాయిదా తీర్మానం కోరారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నిరాకరించారు. దీంతో 'లగచర్ల బాధితులకు న్యాయం చేయాలి.. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తి వేయాలి' అంటూ శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ సభ్యులు చైర్మన్ పోడియాన్ని చుట్టుముట్టారు. రైతులకు న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. పెద్ద పెట్టున నినాదాలు చేయడంతో మండలి హోరెత్తింది. సభ ముందుకు సాగకపోగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడే ప్రయత్నం చేసినా వీలు కాలేదు. దీంతో మండలిని మంగళవారానికి వాయిదా వేస్తూ చైర్మన్ ప్రకటించారు.



శాసనసభ ఆవరణలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పద్మారావుగౌడ్, సబితాఇంద్రారెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు

### చైర్మన్ కార్యాలయం ఎదుట ధర్నా

సమావేశం వాయిదా పడిన అనంతరం బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలంతా మండలి చైర్మన్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. లగచర్ల రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నినాదాలతో మండలి ప్రాంగణం మార్మోగింది. అనంతరం మండలి మీడియా పాయింట్‌లో మధుసూదనాచారి మాట్లాడుతూ లగచర్ల అంశంపై మండలిలో వాయిదా తీర్మానం కోరితే చైర్మన్ అనుమతించలేదని, రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి కనీసం మానవత్వం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రేవంత్‌రెడ్డిపై పట్నం నరేందర్‌రెడ్డి గెలిచిన నేపథ్యంలో ఆయనపై సీఎం కక్ష సాధింపు చర్యలకు దిగారని విమర్శించారు. ఇప్పటి వరకు నరేందర్‌రెడ్డికి బెయిల్ రాలేదని చెప్పారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు వాణీదేవి, సత్యవతి రాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎల్ రమణ, తాతా మధు, పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, డాక్టర్ యాదవరెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

### దద్దరిల్లిన మీడియా పాయింట్

లగచర్ల రైతుల అంశంపై చర్చించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీని వాయిదా వేసిన వెంటనే బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలంతా కలిసి సభ నుంచి లాబీల వైపు నినాదాలు చేస్తూ బయటకు వచ్చారు. ఎమ్మెల్యేల ఎంట్రీ గేటు వద్ద ప్లకార్డులు ప్రదర్శించి పెద్దపెట్టున నినాదాలు చేశారు. 'గిరిజన రైతులకు సంకెళ్లా? సిగ్గు సిగ్గు' 'గిరిజన బిడ్డలకు బేడీలా? సిగ్గు సిగ్గు' 'ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం.. లాఠీరాజ్యం.. లూటీ రాజ్యం' 'రైతులకేమో జైళ్లు.. మంత్రులకేమో జల్సాలు?' అంటూ రైతుల పక్షాన నినదించారు. ఈ క్రమంలో మీడియా ప్రతినిధులు వారిని ఫొటోలు తీస్తుంటే అసెంబ్లీ సిబ్బంది ఫోన్లు గుంజుకునే ప్రయత్నం చేశారు. అప్పటికప్పుడే పెద్ద సంఖ్యలో పోలీసులు చేరుకొని, వ్యాన్లను తెప్పించి, వారిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించడంతో బీఆర్‌ఎస్ నేతలు నేరుగా మీడియా పాయింట్ వద్దకు వచ్చి నినాదాలు చేశారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పెద్దపెట్టన నినాదాలు చేసి, ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

## ప్రభుత్వ అరాచకాలపై పోరాడుదాం

- కార్మిక లోకానికి అండగా బీఆర్‌ఎస్ : కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): సామాన్యుల హక్కులను హరిస్తున్న కాంగ్రెస్ పాలనపై సంఘటితంగా పోరాటం చేయాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం బీడీఎల్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీడీఎల్ కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. శాసన సభలో కార్మికుల హక్కులు, సమస్యలపై సర్కార్‌ను నిలదీస్తామన్నారు. రాజ్యసభలోనూ కేంద్రంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు. అన్ని కార్మిక సంఘాలు సంఘటితమై ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని సూచించారు. సంక్షోభంలో ఉన్న ఆటో కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఏడాది పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్నదని విమర్శించారు. రైతులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులు, లగచర్ల భూముల రైతులు తమ హక్కుల కోసం పోరాడుతుంటే వారిపై అణచివేత చర్యలు చేపట్టడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యహరిస్తే ఎవర్నీ వదలబోమని హెచ్చరించారు. జనవరి మొదటి వారంలో బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికుల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్మికుల సమస్యలపై చర్చించి, ప్రభుత్వంపై పోరాటాలకు కార్యాచరణ రూపొందించి క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పారు.

### పబ్లిక్ సెక్టార్ కంపెనీల పునరుద్ధరణకు కేసీఆర్ కృషి

రాష్ట్రాభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించిన పబ్లిక్ సెక్టార్ కంపెనీల పునరుద్ధరణకు కేసీఆర్ విశేష కృషి చేశారని కేటీఆర్ వెల్లడించారు. బీఆర్‌ఎస్ హయాంలో మేధావులు, నిపుణులతో కలిసి ప్రతిష్ఠాత్మక ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. సింగరేణి వంటి సంస్థకు ఎన్నడూ లేని స్థాయిలో లాభాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం పబ్లిక్ సెక్టార్ సంస్థలను అదానీకి రాసిస్తున్నదని మండిపడ్డారు. బయ్యారంలో స్టీల్ ప్లాంట్ పెట్టాలని కోరితే దానికి అవసరమైన ఇనుప గనులను అదానీకి రాసిచ్చారని విమర్శించారు. రైతు కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీకి అప్పగించి దాన్ని బలపరిచిన ఘనత కూడా కేసీఆర్‌దేనని గుర్తుచేశారు. సమావేశంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, వాణీదేవి, నవీన్ కుమార్‌రెడ్డి, శంభీపూర్ రాజు పాల్గొన్నారు.

# భట్టిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సభను తప్పదారి పట్టించారన్న బీఆర్‌ఎస్
- సభా ప్రాంగణంలో ఆంక్షలా?
- విధాన నిర్ణయం బయట చేస్తారా?
- మాజీ మంత్రి కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సభను, ప్రజలను తప్పుదారి పట్టించారని పేర్కొంటూ స్పీకర్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై బీఆర్‌ఎస్ సోమవారం సభా హక్కుల నోటీసులు ఇచ్చింది. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల చేసిన సందర్భంలో రూ. 6.7 లక్షల కోట్ల అప్పులున్నాయని ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క సభను తప్పుదారి పట్టించారని స్పష్టంచేసింది. ఆర్‌బీఐ విడుదల చేసిన తాజా నివేదికలో అప్పు రూ.3.89 లక్షల కోట్లేనని తేల్చిన విషయాన్ని ఉదహరించింది. అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లాబీలో మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిపై తాము ఇచ్చిన సభా హక్కుల ఉల్లంఘనపై నాటి స్పీకర్ నాదెండ్ల మనోహర్ అనుమతి ఇచ్చారనే విషయాన్ని గుర్తుచేశారు. డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఈ విషయం తెలుసని చెప్పారు. ఈ క్రమంలో తమ నోటీసులను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం నుంచి మొదలుకుంటే మంత్రులు, ఇతర కాంగ్రెస్ నేతలు అప్పులపై బయట కూడా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అప్పులు, వాటికి సంబంధించిన వడ్డీల లెక్కలన్నీ తప్పుల తడకలేనని, ఆర్‌బీఐ నివేదికే ఇందుకు నిదర్శమని చెప్పారు. మాజీ సర్పంచ్‌లకు రూ. 600 కోట్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశామన్నారు. బడా కాంట్రాక్టర్లకు ఇచ్చిన రూ.1200 కోట్ల బిల్లుల్లో సగం చెల్లించినా మాజీ సర్పంచ్‌ల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. రైతు కూలీలకు రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన ప్రకటన సభా సంప్రదాయాలకు విరుద్ధమని కేటీఆర్ స్పష్టంచేశారు. అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నప్పుడు విధానపరమైన నిర్ణయాలను సభలోనే ప్రకటించాలనే విషయాన్ని భట్టి మరచిపోయారని ఎద్దేవాచేశారు. ఈ విషయాన్ని తాము స్పీకర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

### సభా ప్రాంగణంలో ఆంక్షలా?

గతంలో ఎప్పుడూ లేనివిధంగా మాజీ ఎమ్మెల్యేలను, మాజీ ఎమ్మెల్సీలను శాసనసభ వైపు రావద్దని ఆదేశాలు జారీ చేయటంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణానికి వచ్చి మంత్రులను, ముఖ్యమంత్రిని కూడా కలిసేవారని పేర్కొన్నారు. అసెంబ్లీలోకి ప్లకార్డులను సైతం తీసుకురాకూడదని ఆంక్షలు జారీ చేయటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 2 లక్షల మంది విద్యార్థులు తగ్గారని, ఇదే విషయాన్ని చెప్పేందుకు వెళ్లిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని అడ్డుకున్నారని విమర్శించారు.

మరిన్ని వార్తలు ntnews.comలో చూడగలరు

